


**"ఎంతౌతుందేమిటి?" అడిగాడు కందర్పరావు-ఉదయాన్నే నన్ను కలిసి.**

పలకరింపులు, నమస్కారాలు లేకుండానే తనకి కావలసిన సమాచారం కోసమే వచ్చినట్లుగా ప్రవర్తిస్తాడు కందర్పరావు.

అంతకు రెండు రోజుల క్రితమే-ఒక విషయం గురించి నాతో ప్రస్తావించాడు. దానికయ్యే ఖర్చువెచ్చాలు ఎంతౌతాయన్నది అంచనా వేసే పని నామీద మోపాడు.

కందర్పరావు హఠాత్తుగా-నామీదఎప్పుడు పడ్తాడోనన్న భయం నాకుంది. కనుకే నేను గత రాత్రే చిత్తు కాగితంపైన అంతా వివరంగా వ్రాసి వుంచా.

నేను అందించిన పుస్తకంలోకి తల వంచి-మల్లగుల్లాలు పడ్డవాడిలా- "బాప్‌రే!" అన్నాడు నోరు బార్లా తెరిచేసి. "ఏం? అంతపదనా నీ వుద్దేశం?" అయితే మరెందుకు నాచేత ఎస్టిమేషన్ వేయించావు! చేసిన పనిని సమర్థించని వారంటే నాకు మంట.

ఆ మంటని మాటల్లో రంగరించాను.

"ఎస్టిమేషన్ వెయ్యమన్నాను సరే,... కాని యింత ఘోరంగానా? శాలువా మూడొందలన్నావు...."

"మంచిదయితే ఎందుకవదూ"

"దండలు అరవై రూపాయలు వేసావు."

"మరి అధ్యక్షుడు, వక్త చీఫ్ గెస్ట్‌కి, మరొకటి సన్మానితుడికి.... ఒక్కో దండ పదిహేను వేసాను."

"బిస్కెట్స్ ఇరవై రూపాయలు?"

"ఔను! చూసి చూసి తౌడు బిస్కెట్లు పెట్టలేరు కదా! అందుకని"

"ఇంక కిస్మత్‌లు వగైరాలన్నీ....ముప్ఫయివేసావు..."

"మరీ చౌకరకం జింజర్ సోడాలయితే బాగోదని"

కందర్పరావు సాధించటం నాకు సుతరామూ నచ్చలేదు. తనకు చేతకానిది ఒకరికి చేతనయినా ఓపట్టాన అంగీకరించని మనస్తత్వం అతనిది.

అందుకే వేగలేక కుక్కిన పేనులా వుండిపోయాను-

"మాట్లాడవేం!? " అన్నాడు కందర్పరావు కదులుస్తూ!

"మాట్లాడితే కరిచేలా వున్నావు" నా కోపం ప్రదర్శించాను.

"బాబ్బాబూ! నే చెప్పిన ప్రకారం జాబితా తయారు చేయి. అసలే టైం దగ్గరపడుతూంది." కాళ్లు పట్టుకునే దాకా వచ్చాడు.

"సర్లే" కాదనలేకపోయాను.

"శాలువా! తక్కువ ధరలో చూడు."

"వందకు తక్కువయితే బాగోదు. ఆలోచించు. వ్రాసేదా?" అడిగాను.

బుర్రూపాక వ్రాశాను.

"దండలు గులాబీవేం అక్కర్లేదు. నాలుగు కనకాంబరాలు వేసి, మధ్యన ధవనం కట్టలు కూరి కట్టమంటే సరిపోతుంది. అలా అయితే ఎంతవుతుంది!"

"మెడలో దండ వేసి నట్టుండదు, పచ్చగడ్డివేలాడ దీసినట్టుంటుంది. పోనీ నీ యిష్టం. దండ అయిదు చొప్పున వేస్తా!"

"ఇంక బిస్కెట్స్ రూపాయి ప్యాకెట్స్ విప్పి ప్లేట్లలో సర్దితే సరిపోతుంది. కిస్మత్‌ల కంటే 'రస్న' అయితే కొంచెం ఖర్చు తగ్గుతుంది. వ్రాశావా...."

"ఆ ఆ చిత్తం తమరు చెప్పిందల్లా వ్రాస్తున్నా! మరి ఫొటో! కలర్‌ది తీయిస్తారా!"

"ఒద్దొద్దు! బోలెడు కాస్ట్... తెలుపు-నలుపు చాలు, టోటల్ ఎంతయింది" అడిగి నావంక ఆదుర్దాగా దృష్టి నిలిపాడు.

చెప్పాను.

మళ్లా-"బాప్‌రే" అన్నాడు కందర్పరావు.

అర్థం కాకపోవటమే కాక- చిరాకు తన్నుకొచ్చింది.

"అయినా ఆ వెధవడికో సన్మానం చేయటానికి ఎంతౌతుందోనని సంఘం వాళ్లు కనుక్కోమంటే నీకేం పోయింది." పుస్తకం అతని మీదకి గిరాటేసాను.

"నీకేం ఎంతైనా వేస్తావు... కానీ సన్మానం ఖర్చు నేను భరించవద్దూ!" అగ్గగ్గలాడాడు.

"నువ్వెందుకూ భరించడం?"అంతకు మించి స్వరం పెంచి అడిగాను.

"అబ్బ! ఆ సన్మానం నాకే మహానుభావా!" అనేసి వీధిలోకి పుడాయించాడు కందర్పరావు!

○